సాక్షి
మంచిర్యాల
మంగళవారం। 21। మే। 2024



రైలుపట్టాలపై రక్త చరిత్ర

రైలుపట్టాలు రక్తసిక్తం అవుతున్నాయి. క్షణికావేశంలో కొందరు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంటున్నారు. మరికొందరిని హత్య చేసి పట్టాలపై పడేసిన సంఘటనలు ఉన్నాయి. 8లో▸



చెరువులో వాటా ఇవ్వాలని..

చెన్నూర్ పెద్ద చెరువులో వాటా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ముదిరాజ్‌లు ఆందోళన చేపట్టారు. 60 ఏళ్లుగా గంగపుత్రులు, ముదిరాజ్ కులస్తులకు వాటాలు ఉన్నాయన్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
38.0 /28.0

వాతావరణం

ఆకాశం ఉదయం ప్రకాశవంతంగా, రాత్రివేళ మేఘావృతమై ఉంటుంది. ఆగ్నేయం దిశగా గాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి.

అర్హతకు మించి వైద్యం!

- ఆర్‌ఎంపీలతో రోగుల పరేషాన్
- ఆసుపత్రుల్లో మాదిరిగా చికిత్సలు
- నీల్వాయిలో బాలిక మృతితో ఆందోళన
- ప్రాథమిక, ఆరోగ్య ఉపకేంద్రాల్లో సౌకర్యాల లేమి



జిల్లాలో ఆర్‌ఎంపీ క్లినిక్‌లో తనిఖీ చేస్తున్న టీఎస్‌ఎంసీ సభ్యులు(ఫైల్)

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అర్హతకు మించి అందించే వైద్యంతో రోగుల ప్రాణాలకే ప్రమాదం ఏర్పడుతోంది. అత్యవసర వేళ రోగులు స్థానిక ఆర్‌ఎంపీ, పీఎంపీలకు వద్దకు వెళ్తే కొన్నిసార్లు అనుకోని పరిస్థితి ఎదురవుతోంది. సోమవారం వేమనపల్లి మండలం నీల్వాయిలో ఆర్‌ఎంపీ వద్ద చికిత్స పొంది బాలిక మృతిచెందడం ఆందోళన కలిగిస్తోంది. కార్పొరేట్ స్థాయి ఆస్పత్రుల పేరుతో ఇచ్చే చికిత్స కోసం అధిక ఫీజుల భారం మోయలేక చాలామంది స్థానిక ఆర్‌ఎంపీ, పీఎంపీలను ఆశ్రయిస్తున్నారు. గ్రామీణ, పట్టణాల్లో స్థాయికి మించి వైద్యం చేస్తున్న కొందరు ఆర్‌ఎంపీ, పీఎంపీలతో రోగులు పరేషాన్ అవుతున్నారు.

పోటీపడుతున్న ఆర్‌ఎంపీలు

జిల్లాలోని 18మండలాల్లో రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టిషనర్స్(ఆర్‌ఎంపీ), ప్రైవేటు మెడికల్ ప్రాక్టిషనర్స్(పీఎంపీ)లు 500 మంది వరకు ఉన్నట్లు అంచనా. ఇందులో చాలామంది ఎంబీబీఎస్, ఎండీ వైద్యుల వద్ద కొన్నాళ్లు పని చేసి సొంతంగా క్లినిక్‌లు నిర్వహిస్తున్నారు. వాడకు, గల్లీకి ఇద్దరు ముగ్గురు ఉండడంతో ఆర్‌ఎంపీల వృత్తిలో సైతం పోటీ పెరిగింది. వీరిలో కొందరికి కనీస అర్హత సర్టిఫికెట్లు లేవు. సుదీర్ఘ కాలం ఈ వృత్తిలోనే ఉంటూ పరిచయాలు పెంచుకున్నారు. జిల్లా కేంద్రం, పట్టణాలు, సింగరేణి కార్మిక వాడల్లోనూ ఆస్పత్రులు ఉన్నా ఆర్‌ఎంపీలు ఎంబీబీఎస్ వలే వైద్యం చేస్తున్న వారు ఉన్నారు. నిబంధనల ప్రకారం ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాలి. క్లినిక్‌లో బెడ్‌లు వేసి రోజుల తరబడి చికిత్స ఇవ్వరాదు. చిన్నపిల్లలు, గర్భిణులు, వృద్ధులు, ఇతర దీర్ఘకాలిక రోగులు, ప్రత్యేక అవసరాలు ఉన్న వారికి చికిత్స చేయొద్దు. కానీ నిబంధనలు తుంగలో తొక్కుతూ పరిధి దాటుతున్నారు. ఇటీవల జిల్లాలో రాష్ట్ర వైద్య మండలి సభ్యుల ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. జిల్లా కేంద్రంతోపాటు నస్పూర్, లక్సెట్టిపేట, మందమర్రి, బెల్లంపల్లి, తాండూర్, చెన్నూర్ తదితర చోట్ల ఆర్‌ఎంపీ, పీఎంపీల క్లినిక్‌లను సందర్శించారు. డీఎంహెచ్‌వో సైతం స్థాయికి మించి వైద్యం చేయొద్దని ఆదేశించారు. కానీ కొందరు ఆ పరిధి దాటి మరీ వ్యవహరించడంతో అనర్థాలకు దారి తీస్తోంది.

ప్రాథమిక వైద్యమే చేస్తున్నాం

స్థానిక ప్రజలకు అందుబాటు ఉంటూ ఆర్‌ఎంపీలు వైద్య సేవలు చేస్తున్నారు. తక్కువగా ఖర్చుతో చికిత్స ఇస్తున్నారు. ఎవరైనా అర్హతకు మించి వైద్యం చేస్తే వారిపై చర్యలు తీసుకోవచ్చు. తనిఖీల పేరుతో ఇబ్బందులకు గురిచేయొద్దు.

– సీహెచ్.ఐలయ్య, జిల్లా అధ్యక్షుడు, తెలంగాణ ఆర్‌ఎంపీ, పీఎంపీల సంఘం

సర్కారులో వైద్య సేవలు అందక

గ్రామీణ, మండల స్థాయిలో సేవలు అందించాల్సిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాల్లో సరిపడా సిబ్బంది, సౌకర్యాలు లేకపోవడంతో సమస్యలు వస్తున్నాయి. దీంతో ఆపద వేళ బాధితులు ఈ కేంద్రాలకు చికిత్స కోసం వెళ్లడం లేదు. ప్రత్యామ్నాయంగా ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. స్థానికంగా ఎల్లప్పుడు అందుబాటులో ఉంటున్నారు. ఇక ప్రైవేటు ఆస్పత్రిలో ఓపీ ఫీజు, పరీక్షలు, మందులతో రూ.వేలల్లో గుంజుతారనే భయంతో స్థానిక ఆర్‌ఎంపీలతో తక్కువ ఖర్చులో చికిత్స పొందవచ్చని భావిస్తున్నారు. జ్వరం, దగ్గు, జలుబు, కడుపునొప్పి, ఒళ్లునొప్పులు, బీపీ, షుగర్ బాధితులు అధికంగా వెళ్తున్నారు. తీవ్రత అధికంగా ఉండే వృద్ధులు, చిన్నారులకు చికిత్స అందిస్తున్నారు. బాధితులకు ఉపశమనం కలిగించేందుకు ఎంబీబీఎస్, స్పెషలిస్టుల మాదిరి మందులు రాస్తున్నారు. కొన్నిసార్లు యాంటిబయాటిక్స్, స్టెరాయిడ్స్ హైడోస్ ఇస్తున్నారు. దీంతో చికిత్స తిరగబడుతోంది. పరిస్థితి విషమిస్తే తమకు పరిచయాలు ఉన్న ఆస్పత్రికే రెఫర్ చేస్తూ అక్కడి నుంచి కమీషన్లు దండుకుంటున్నారనే ఆరోపణలున్నాయి.

అక్షరాస్యత కార్యక్రమాన్ని నిరంతరం చేపట్టాలి



కన్నెపల్లిలో మాట్లాడుతున్న డాక్టర్ రవికాంత్‌రావు

భీమిని/మందమర్రిరూరల్: నిరక్షరాస్యత నిర్మూలనకు అక్షరాస్యత కార్యక్రమాన్ని నిరంతరంగా కొనసాగేలా ప్రభుత్వం న్యూ ఇండియా లిట్రసీ ప్రోగ్రాంను ప్రవేశపెట్టిందని స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ టెక్నాలజీ(ఎస్ఐఈటీ) ఇన్‌చార్జి, ప్రొఫెసర్ డాక్టర్ రవికాంత్‌రావు అన్నారు. వయోజన విద్యా శాఖ, మంచిర్యాల సఖి, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జిల్లాలో చేపడుతున్న అక్షరాస్యతపై కుట్టు శిక్షణ కేంద్రాలను సోమవారం కన్నెపల్లి మండల కేంద్రం, మందమర్రి పట్టణంలోని శ్రీపతినగర్‌లో సందర్శించి మాట్లాడారు. కొన్నేళ్లుగా రాష్ట్రంలో అక్షరాస్యత కార్యక్రమాలు అధికారికంగా ముగిసినప్పటికీ జిల్లాలో వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ కేంద్రాల్లో అక్షరాస్యత నేర్పడం వంటి కార్యక్రమాలు చేపట్టడంపై ఆయన వయోజన విద్యాశాఖ అధికారి పురుషోత్తంను అభినందించారు. మహిళలు చదువు, ఉపాధి నైపుణ్యాన్ని నేర్చుకుంటూ జీవితంలో ఎదగాలన్నారు. 8, 9, 10 తరగతి విద్యార్థులు కూడా జిల్లా నిరక్షరాస్యత కార్యక్రమంలో పాల్గొని వంద శాతం అక్షరాస్యతగా గ్రామాలుగా తీర్చిద్దాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తంనాయక్, లీడ్ బ్యాంకు మేనేజర్ తిరుపతి, జిల్లా విద్యాశాఖ సెక్టోరల్ అధికారి సత్యనారాయణమూర్తి, కన్నెపల్లి మండల బ్యాంకు మేనేజర్ గురుమూర్తి, లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలు బండ శాంకారి, డీఆర్‌పీలు సువర్ణ, ప్రకాశం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో ప్రవేశాలు

మంచిర్యాలటౌన్: జిల్లాలోని గిరిజన విద్యార్థుల నుంచి బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో 3, 5, 8వ తరగతుల్లో ప్రవేశం కోసం 2024–25 విద్యా సంవత్సరానికి గాను దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాకు 41 సీట్లు కేటాయించగా, 3వ తరగతిలో 21 సీట్లు, 5వ తరగతిలో 10 సీట్లు, 8వ తరగతిలో 10 సీట్లు ఉన్నాయని, ఐటీడీఏ కార్యాలయంలో దరఖాస్తులు ఉచితంగా అందజేస్తామని, ఈ నెల 21 నుంచి జూన్ 6లోగా సంబంధిత ధ్రువీకరణ పత్రాలు జతచేసి దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. అభ్యర్థుల కుటుంబ ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలకు మించి ఉండరాదని, జూన్ 12న అభ్యర్థులను లాటరీ పద్ధతిన ఎంపిక చేస్తారని తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తుతోపాటు బోనఫైడ్, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు జతచేసి జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

కలెక్టరేట్ ఎదుట గొల్లకుర్మల ఆందోళన



ఆందోళనలో పాల్గొన్న గొల్లకుర్మలు

మంచిర్యాలఅగ్రికల్చర్: రెండో విడత గొర్రెల యూనిట్లకు డీడీలు కట్టిన వారికి గొర్రెలు అందించాలని సోమవారం భీమిని మండలం చిన్నగుడపేట్‌కు చెందిన గొల్లకుర్మలు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. అప్పు చేసి 83మంది 2022లో రూ.43వేల చొప్పున డీడీలు కట్టినట్లు తెలిపారు. మండల పశువైద్యాధికారి డీడీలు కట్టించాడని, గొర్రెలు ఎప్పుడు ఇస్తారని అడిగితే తనకు ఫోన్ చేసి ఇబ్బంది పెట్టొద్దని అంటున్నాడని తెలిపారు. అనంతరం జిల్లా పశువైద్య, సంవర్ధక శాఖ అధికారి రమేష్‌ను కలిసి సమస్య విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ప్రభుత్వ నిర్ణయం మేరకు గొర్రెలు అందించడమా, డీడీ నగదు అందిస్తుందా అనేది తెలుస్తుందని అన్నారు.

వడ్లకు బోనస్ డబ్బులు చెల్లించాలి



మాట్లాడుతున్న ఆశయ్య

బెల్లంపల్లి: రైతులు పండించిన సన్న, దొడ్డు రకం వడ్లకు ప్రభుత్వం రూ.500 బోనస్ చెల్లించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పైళ్ల ఆశయ్య అన్నారు. సోమవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. కల్లాల్లో ఉన్న సన్న, దొడ్డురకం వడ్లను పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని తెలిపారు. అకాల వర్షాల వల్ల కొన్ని చోట్ల వడ్లు నీటి పాలయ్యాయని, వాటిని కూడా కొనుగోలు చేయాలని డిమాండ్‌చేశారు. బోనస్ చెల్లింపుల్లో తేడాలు చూపవద్దన్నారు. ఈ సమవేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రవి, బెల్లంపల్లి పట్టణ, మండల కార్యదర్శులు రమణ, అశోక్, సంకీర్తన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కార్మికులకు లాభాల్లో వాటా చెల్లించాలి



వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: కంపెనీ గత సంవత్సరం సాధించిన లాభాల నుంచి కార్మికులకు 45 శాతం వాటా చెల్లించాలని తెలంగాణ జన సమితి, తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు యాజమాన్యాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిజ్జన రమేష్, తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం లీగల్ అడ్వయిజర్ రత్నకిరణ్, రాష్ట్ర అధ్యక్షుడు కామర గట్టయ్య హైదరాబాదులోని సింగరేణి భవన్‌లో సీఎండీ బలరాం నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్మికులకు సొంతింటి పథకం అమలు చేయాలని, ఇంటి నిర్మాణం కోసం రూ.20 లక్షల వడ్డీ లేని రుణం ఇవ్వాలని కోరారు. భూపాలపల్లి ఏరియాలో అకారణంగా డిస్మిస్ చేసిన కార్మికులకు ఉద్యోగం కల్పించాలని కోరారు. ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి కుమార్‌స్వామి, నాయకులు దేవి సత్యం, వెంగళ కనకయ్య, జైపాల్‌సింగ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు బంద్..!

- జిల్లాలో సగానికిపైగా తెరుచుకోని కేంద్రాలు
- చిన్నారులు, గర్భిణులకు అందని పౌష్టికాహారం
- అధికారుల పర్యవేక్షణ కరువై తాళాలు



సోమవారం తెరుచుకోని మంచిర్యాల సంజీవయ్య కాలనీ అంగన్‌వాడీ కేంద్రం

జిల్లాలోని ఐసీడీఎస్ ప్రాజెక్టులు, అంగన్‌వాడీ కేంద్రాలు, చిన్నారులు

ప్రాజెక్టు	అంగన్‌వాడీ కేంద్రాలు	చిన్నారులు
బెల్లంపల్లి	279	11,477
చెన్నూరు	245	9,469
లక్సెట్టిపేట	203	7,874
మంచిర్యాల	242	12,657
మొత్తం	969	41,477

మంచిర్యాలటౌన్: విద్యాసంస్థలకు ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించినా.. చిన్నారులు, గర్భిణులకు పౌష్టికాహారం అందించాల్సి ఉండడంతో అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ఇవ్వలేదు. కానీ మే నెలలో 15రోజుల చొప్పున ఆయాలు, అంగన్‌వాడీ టీచర్లకు సెలవులు ప్రకటించింది. అంటే 15రోజులు ఆయాలు, మిగతా 15రోజులు టీచర్లు కేంద్రాలను తెరిచి చిన్నారులకు పౌష్టికాహారంతో కూడిన భోజనం అందించాల్సి ఉంటుంది. ఎండలు మండిపోతుండడం, ఉదయం నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు ఉక్కపోత ఉంటుందని సగం మంది చిన్నారులు మాత్రమే కేంద్రాలకు హాజరవుతున్నారు. గర్భిణులూ అంతంత మాత్రంగానే వస్తుండడంతో ఎవరూ రావడం లేదనే సాకుతో ఎలాంటి అనుమతి తీసుకోకుండానే పని దినాల్లోనూ అంగన్‌వాడీ కేంద్రాలను తెరవడం లేదు. జిల్లాలో సగానికిపైగా కేంద్రాలు మూసి ఉండడం వల్ల కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఆయా రోజుల్లో పౌష్టికాహారం అందకుండా పోతోంది. ఆటపాటలతో కూడిన విద్యాబోధన, పౌష్టికాహారం ఉచితంగా అందించే కేంద్రాలు మూసివేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. హాజరవుతున్న సగం మందికైనా పౌష్టికాహారంతో కూడిన భోజనం అందించి, హాజరు కాని వారికి ఇంటికి ఆయా సరుకులను అందించడం లేదు.

చిన్నారుల ఎదుగుదలపై ప్రభావం

పేద కుటుంబాలకు ఆర్థికస్థోమత లేక చిన్నారులకు పౌష్టికాహారం అందడం లేదు. ఇలాంటి వారికి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకుకూరలతో వండిన భోజనం, పాలు, గుడ్లు, స్నాక్స్, బాలామృతం వంటివి అందిస్తుంటారు. గర్భిణులకు సైతం పౌష్టికాహారం అందుతుంది. ప్రభుత్వ సెలవు దినాల్లో కేంద్రాలు మూసే ఉంచుతారు. పనిదినాల్లో తప్పనిసరిగా పౌష్టికాహారం అందించాల్సి ఉంటుంది. చిన్నారులు, గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్నా చిన్నారుల్లో ఎదుగుదలలో లోపాలు కనిపిస్తున్నాయి. ఎత్తుకు తగిన బరువు లేకపోవడం, వయస్సుకు తగిన ఎత్తు లేకపోవడం, బరువుకు తగిన ఎత్తు లేకపోవడం ఇలా ఏదో ఒక లోపం చిన్నారుల్లో కనిపిస్తోంది. జిల్లావ్యాప్తంగా 969 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, ఎండ వేడి, వసతులు లేక, ఉక్కపోత భరించలేమనే సాకుతో సగానికి పైగా కేంద్రాలు తెరవడం లేదని తెలుస్తోంది. తనిఖీ చేయాల్సిన ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తాళాలు వేసి ఉన్నా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. కేంద్రాలను తెరవకున్నా తెరిచినట్లుగా కొందరు టీచర్లు సూపర్‌వైజర్లను మచ్చిక చేసుకుంటున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. గత ఏడాది మే నెలలో టీచర్లు, ఆయాలు అంగన్‌వాడీ కేంద్రాలను తెరవనందుకు గాను సూపర్‌వైజర్లు, సీడీపీవోలకు డబ్బులను జమ చేసి పెద్ద మొత్తంలో ముట్టజెప్పినట్లు బయటకు వచ్చింది. ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణించి కారకులను బదిలీచేశారు. ఈ ఏడాది కూడా టీచర్లు, ఆయాలు కేంద్రాలను తెరవకపోవడం, గతంలో మాదిరిగానే డబ్బులు జమ చేస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

తనిఖీ చేస్తున్నాం



జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలని సీడీపీవోలు, సూపర్‌వైజర్లకు ఆదేశాలు ఇవ్వడంతోపాటు సోమవారం కొన్నింటిని తనిఖీ చేశాం. మూసి ఉంచితే టీచర్లు, ఆయాలపై చర్యలు తీసుకుంటాం. ఎండలు ఎక్కువగా ఉండడం వల్ల పిల్లలు తక్కువగా హాజరవుతున్నారు. పిల్లలు వచ్చినా, రాకపోయినా కేంద్రాలను పనిదినాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు తెరిచి ఉంచడంతోపాటు వారికి పౌష్టికాహారంతో కూడిన భోజనం అందించాలని ఆదేశించాం.

– చిన్నయ్య, జిల్లా సంక్షేమశాఖ అధికారి, మంచిర్యాల

చిరుతపులి చర్మం, స్మగ్లర్ల పట్టివేత



మాట్లాడుతున్న ఏసీపీ వెంకటేశ్వర్‌రావు



స్వాధీనం చేసుకున్న చిరుత పులి చర్మం

- వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు
- జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రావు

చెన్నూర్: తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దులోని కోటపల్లి మండలం రాపన్‌పల్లి చెక్‌పోస్టు వద్ద సోమవారం ఇద్దరు అంతర్రాష్ట్ర చిరుతపులి చర్మం స్మగ్లర్లను పోలీసులు పట్టుకున్నారు. చిరుత చర్మం, మోటారుసైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. చెన్నూర్ ఫారెస్టు డివిజన్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రావు వివరాలు వెల్లడించారు. కోటపల్లి ఎస్సై రాజేందర్ రాపన్‌పల్లి చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. మహారాష్ట్ర నుంచి ఇద్దరు వ్యక్తులు మోటార్‌సైకిళ్లపై మంచిర్యాల వైపు వస్తూ అనుమానాస్పదంగా కనిపించారు. మోటార్ సైకిళ్లను తనిఖీ చేయగా చిరుతపులి చర్మం, గోర్లు లభించాయి. వారిని విచారించగా.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా వర్ధల్లి గ్రామానికి చెందిన దుర్గం పవన్ గత రెండేళ్ల క్రితం బీజాపూర్ జిల్లా బొడగుట్ట అటవీ ప్రాంతంలో హతమార్చాడని వెల్లడైంది. చిరుతపులి చర్మాన్ని విక్రయించడానికి బీజాపూర్ జిల్లా లింగాపూర్ గ్రామానికి చెందిన బాబర్‌ఖాన్‌ను పవన్ సంప్రదించాడు. చర్మం విక్రయించి ఇస్తే రూ.50వేలు ఇస్తానని అతడితో ఒప్పందం కుదుర్చుకున్నాడు. సోమవారం చిరుతపులి చర్మాన్ని విక్రయించేందుకు మోటార్‌సైకిళ్లపై మంచిర్యాల వైపు వస్తుండగా పవన్, బాబర్‌ఖాన్‌లను పోలీసులు పట్టుకున్నారు. చిరుత చర్మం, రెండు మోటారుసైకిళ్లు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. చిరుతచర్మంగా కోటపల్లి ఎఫ్ఆర్వో రవి ధ్రువీకరించారు. వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం చిరుతచర్మం, మోటర్ సైకిళ్లను అటవీ అధికారులకు అప్పగించామని ఏసీపీ వివరించారు. వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎఫ్‌డీవో రమేశ్, కోటపల్లి ఎస్సై రాజేందర్, ఎఫ్ఆర్వో రవి పాల్గొన్నారు.

పథకాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి



మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్, అధికారులు

- జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజా సంక్షేమం, దేశాభివృద్ధి దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమాభివృద్ధి పథకాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకుంటామని జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్ అన్నారు. కేంద్ర సర్వీసులకు చెందిన వివిధ శాఖల సహాయ విభాగాల అధికారులకు నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో 'విలేజ్ అటాచ్‌మెంట్ మాడ్యూల్' అంశంపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 24 వరకు కేంద్ర సర్వీసులకు చెందిన సహాయ విభాగాల అధికారులు శిక్షణలో భాగంగా జిల్లాలో వారికి కేటాయించిన గ్రామాల్లో పర్యటించి వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారని, ఇందుకు సహాయంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారులను నోడల్ అధికారులుగా నియమించామని తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలు తీరు, లబ్ధిదారులకు అందుతున్న పథకాలను నిశితంగా పరిశీలించాలని తెలిపారు. వివిధ శాఖల జిల్లా అధికారులు తమ శాఖల పరిధిలో అమలు చేస్తున్న వివిధ పథకాలను వివరించారు. జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి కిషన్, జిల్లా సంక్షేమాధికారి చిన్నయ్య, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి అనిత, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, డివిజన్ అధికారులు పాల్గొన్నారు.

ఆ శాఖలో అంతేనా?

- సరెండర్లు, సస్పెన్షన్లతోనూ మారని తీరు
- గాడితప్పుతున్న జిల్లా పౌరసరఫరాల శాఖ



జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లా పౌరసరఫరాల శాఖలో ఉన్నతాధికారులు తీరు వివాదాస్పదంగా మారుతోంది. ప్రజలకు కీలక సేవలు అందించే వాటిలో ఒకటైన ఈ శాఖ పరిధిలో అనేక అక్రమాలు, అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. శాఖ ఉన్నతాధికారులపైనే విధుల్లో నిర్లక్ష్యం, అలసత్వం కారణంగా సరెండర్లు, సస్పెన్షన్లు జరుగుతున్నాయి. గతంలో పని చేసిన ఓ ఉన్నతాధికారి విధుల్లో అలసత్వం వహిస్తున్నారని, ఆ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. పీడీఎస్ బియ్యం, మిల్లర్ల అక్రమ దందాకు సహకరిస్తున్నట్లు తేలడంతో బదిలీ వేటు పడింది. అంతకు ముందు ఇదే శాఖ పరిధిలోనే గత కలెక్టర్ మరో ఉన్నతాధికారిని 'ఆయన సేవలు మాకొద్దు' అంటూ కమిషనర్‌కు సరెండర్ చేశారు. తర్వాత కొన్నాళ్లకు ఇక్కడికే మళ్లీ వచ్చి కొనసాగుతున్నారు. ఇటీవల జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారిని విధుల్లో నిర్లక్ష్యం, శాఖ పరమైన ఆదేశాలు పాటించడం లేదంటూ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో ఇన్చార్జీగా బెల్లంపల్లి ఆర్డీవో హరిక్రిష్ణను డీసీఎస్‌వోగా నియమించారు.

పీడీఎస్ నుంచి మిల్లర్ల దాకా..

ప్రతీ నెలా రేషన్ బియ్యం పంపిణీతోపాటు ధాన్యం కొనుగోళ్లు, రవాణా చేయడం, ఎఫ్‌సీఐ, స్టేట్ కార్పొరేషన్‌కు సీఎంఆర్(కస్టం మిల్లింగ్ రైస్) అప్పగింత వరకు వివిధ దశల్లో పౌరసరఫరాల శాఖ అధికారులు కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుంది. జిల్లాలో చాలామంది మిల్లర్లు సీజన్లు గడుస్తున్నా సకాలంలో బియ్యం ఇవ్వడం లేదు. కోటా ప్రకారం పౌరసరఫరాల శాఖ ధాన్యం మిల్లర్లకు అప్పగిస్తే, మరాడించి ఇవ్వాలి. కానీ టన్నుల కొద్దీ బియ్యం బకాయిలు ఉంటున్నాయి. ధాన్యం కేటాయింపులు, మిల్లుల నుంచి బియ్యం తిరిగి రాబట్టడం పౌరసరఫరాల శాఖ కీలకంగా వ్యవహరిస్తుంది. కొందరు అధికారులు మిల్లర్లతో కుమ్మక్కయి చూసీచూడనట్లుగా ఉంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. బ్లాక్ లిస్టులో పెట్టిన మిల్లులకు సైతం ధాన్యం కోటా కేటాయించడం వంటి ఫిర్యాదులు వచ్చాయి. అంతేకాక రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలను సకాలంలో పాటించకపోగా, జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల సమయంలోనూ ఒత్తిళ్లకు తలొగ్గుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ధాన్యం కటింగ్, రవాణా, మిల్లర్లు ధాన్యం పెట్టే కొర్రీలపైనా పర్యవేక్షణ కొరవడుతోంది. దీంతో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులపై వేటు పడుతోంది. ఇక పీడీఎస్(ప్రజా పంపిణీ వ్యవస్థ)లో స్టేజ్ వన్ నుంచి ఎంఎల్ఎస్ పాయింట్లు అటు నుంచి డీలర్లు, చివరకు లబ్ధిదారులకు దాకా చేరే ప్రతీ నెలా అప్రమత్తంగా ఉండాలి. బియ్యం రవాణా కాంట్రాక్టర్లు, ఇన్చార్జీలు, డీలర్ల మధ్య సమన్వయపర్చడంలో అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఎంఎల్ఎస్ పాయింట్లలో బియ్యం నిలవల్లో తేడాలు వస్తున్నాయి. గతంలో ఇన్చార్జీలు విజిలెన్స్ తనిఖీల్లో బయటపడ్డాయి. ఈ క్రమంలో జిల్లా ఉన్నతాధికారుల చొరవతో ఈ శాఖను గాడినపెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నామినేటెడ్ పదవుల్లో బీసీలకు అవకాశం ఇవ్వాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

పాతమంచిర్యాల: రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నియామకాలు చేపట్టే నామినేటెడ్ పదవుల్లో బీసీలకు తొమ్మిది కేటాయించాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీసీల జనాభా శాతం 56శాతం ఉండగా రాష్ట్రంలో 54 నామినేటెడ్ పదవులు ఉన్నాయని, బీసీలకు జనాభా ప్రాతిపదికన 27 పదవులు ఇవ్వాలి కానీ, రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 17 పదవులు మాత్రమే కేటాయించిందని పేర్కొన్నారు. 7శాతం జనాభా ఉన్న అగ్రకులాలకు 17 పదవులు ఇచ్చిందని, దీంతో సామాజిక న్యాయం జరగడం లేదని తెలిపారు. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించలేదని, కనీసం నామినేటెడ్ పదవుల్లోనైనా న్యాయం జరగాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సమితి నాయకులు శ్రీపతి రాములు, చంద్రగిరి చంద్రమౌళి, అంకం సతీష్, కొంతం రాజు, ఇన్నారం కిరణ్, సిద్ధ పటేల్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

గాయపడిన మహిళా కూలీ మృతి


మల్లవ్వ (ఫైల్)

దండేపల్లి: మండల కేంద్రంలో ఈ నెల 17న ఉపాధి హామీ కూలీల ను తీసుకొస్తున్న టాటా ఏస్ ట్రాలీ ప్రమాదవశాత్తు కాల్వలో బోల్తా పడిన ఘటనలో దండేపల్లికి చెందిన బంగారు మల్లవ్వ (46)కు తీవ్రగాయాలయ్యాయి. కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా సోమవారం తెల్లవారు జామున మృతి చెందింది. మృతురాలికి భర్త, కుమారుడు, కూతురు ఉన్నారు. భర్త నారాయణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై భూమేష్ తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

లింగాపూర్: ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కిమానాయక్ తండాకు చెందిన జాదవ్ యాదగిరి (39) సోమవారం తెల్లవారుజామున కాలకృత్యాలు తీర్చుకునేందుకు బయటకు వెళ్లాడు. గ్రామ సమీపంలోని పశువుల కొట్టంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య వనిత, కుమారుడు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరు..

ఆసిఫాబాద్‌అర్బన్: ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జిల్లా కేంద్రంలోని సందీప్‌నగర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై రాజేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రలోని ఆళ్లపల్లికి చెందిన ముద్రకల్ శ్రీనివాస్ (32) ఐదేళ్లుగా జిల్లా కేంద్రంలోని సందీప్‌నగర్‌లో నివాసం ఉంటూ మేస్త్రీపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్య, పిల్లలతో గొడవపడ్డాడు. వారిని ఇంటిబయటే ఉంచి తలుపులు వేసుకున్నాడు. ఎంతకూ తీయకపోవడంతో బయటే పడుకున్నారు. ఉదయం లేచిన తర్వాత కూడా తలుపులు తీయకపోవడంతో వెంటిలేటర్ నుంచి లోనికిచూడగా ఉరేసుకుని కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. మృతునికి భార్య సమ్మక్క, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని సోదరుడు నగేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

షూరిటీ పెట్టిన పాపానికి ప్రాణం పాయే...


ఖదీర్(ఫైల్)

మంచిర్యాలక్రైం: తెలిసిన వ్యక్తికి మధ్యవర్తిగా ఉండి డబ్బులు ఇప్పించిన పాపానికి ప్రాణం తీసుకున్న ఘటన జిల్లా కేంద్రంలోని మజీద్‌వాడలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం మజీద్‌వాడకు చెందిన మహ్మద్ ఖదీర్ (52) ఆటో ట్రాలీ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తనకు తెలిసిన ఓ మిత్రుడికి అత్యవసరంగా డబ్బులు అవసరం ఉండడంతో ఓ ఫైనాన్సియర్ వద్ద మధ్యవర్తిగా ఉండి అప్పు ఇప్పించాడు. అతను తిరిగి చెల్లించకపోవడంతో సదరు ఫైనాన్స్ వ్యాపారి ఒత్తిడి చేయడం మొదలుపెట్టాడు. దీంతో మనస్తాపానికి గురై సోమవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని కుమారుడు మాథిన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు పట్టాలపై రక్త చరిత్ర..!

- వివిధ కారణాలతో ఏటా వందలాది మరణాలు
- అనుమానాస్పద ఆత్మహత్యలు అనేకం
- గుర్తు తెలియని మృతదేహాల గుర్తింపులో జాప్యం


రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



ఆత్మహత్యలకు నిలయంగా మారిన రైలు పట్టాలు

రైలు కిందపడి మృతి చెందిన వారి వివరాలు

సంవత్సరం	ఆత్మహత్యలు	సాధారణ మరణాలు	ప్రమాదవశాత్తు	గుర్తు తెలియనివి
2022	75	08	43	14
2023	73	17	67	19
2024	25	07	18	11

మంచిర్యాలక్రైం: క్షణికావేశంలో కొందరు... ఆర్థిక ఇబ్బందులతో మరి కొందరు... ఉద్యోగాలు రాలేదని, ప్రేమ విఫలమైందని... సంతానం కలగడంలేదని... కారణాలు ఏవైనా చావే శరణ్యమనుకుని క్షణికావేశంలో నిండు ప్రాణాలు బలి తీసుకుంటున్నారు. మరికొందరు ప్రమాదవశాత్తు రైలు కింద పడి మృతి చెందుతున్నారు. ఇలా ఏడాదికి వందల సంఖ్యలో మృతి చెందుతున్నారు. కొన్ని సందర్భాల్లో ఎక్కడో హత్య చేసి రైలుకింద పడేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారు. రైలు పట్టాలపై మృతదేహాల తీరును పరిశీలిస్తుంటే ఆత్మహత్యా? హత్యా? అంతుచిక్కని పరిస్థితి నెలకొంటోంది. ఇలా ఎంతోమంది ప్రాణాలు బలి తీసుకున్న రైలు పట్టాలు రక్త చరిత్రను రాస్తున్నాయి. రైల్వే పోలీసుల పర్యవేక్షణ లేక పోవడంతోనే రైలూ పట్టాలపై నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. మృతుల్లో ఎక్కువ శాతం 20 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సువారే అధికంగా ఉంటున్నారు.

మృతదేహాలపై అనుమానాలెన్నో..

మంచిర్యాల జిల్లా జీఆర్‌పీ పోలీస్ స్టేషన్ పరిధిలో 2022 నుంచి 2024 ఏప్రిల్ వరకు 377 మంది వివిధ కారణాలతో రైలు పట్టాలపై మృతి చెందారు. ఇందులో 44 మృతదేహాలు గుర్తుతెలియని వ్యక్తులవే కావడం గమనార్హం. ఎవరో.. ఎక్కడివారో.. ఎందుకు చనిపోయారో.. తెలియక పోవడంతో చేసేదేంలేక మూడురోజుల పాటు ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీ గదిలో మృతదేహాన్ని భద్రపరుస్తున్నారు. ఎవరూ రాకపోవడంతో అనాథ శవాలుగా గుర్తించి జీఆర్‌పీ పోలీసులు అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. నెలల తరబడి మృతుల ఆచూకీ లభించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. దూరప్రాంతాల వ్యక్తులెవరైనా నిజంగానే ఆత్మహత్యకు పాల్పడ్డారా? లేక ఎవరైనా ఇతర ప్రాంతాల్లో హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు మృతదేహాన్ని రైలు పట్టాలపై పడేసి వెళ్లి పోతున్నారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇలాంటి కేసులు విచారణ పేరట ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మిస్టరీగానే మిగిలిపోతున్నాయి.

ఆత్మహత్యలు చేసుకునే ప్రాంతాలు...

మంచిర్యాల జీఆర్‌పీ పోలీస్ స్టేషన్ పరిధిలో కాగజ్‌నగర్ నుంచి మొదలుకుని తాండూర్, రేచిని, బెల్లంపల్లి, మందమర్రి, మంచిర్యాల, పెద్దంపేట రైల్వేస్టేషన్ల మధ్య అధికంగా రైలు పట్టాలపై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఈ ప్రాంతాల్లోని రైలు పట్టాలు ప్రజలు సంచరించే ప్రాంతాలకు సమీపంగా ఉండడమే దీనికి ప్రధాన కారణమని అధికారులు భావిస్తున్నారు.

మచ్చుకు కొన్ని సంఘటనలు....

- 2023 ఆగస్టులో మంచిర్యాల శివారులోని గోదావరి సమీపంలో ఓ గుర్తుతెలియని మహిళ (25) దానాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఇప్పటి వరకూ సదరు మహిళ ఆచూకీ లభించలేదు.
- 2023 జూలై 10న జైపూర్ మండలానికి చెందిన ఓ యువకుడు పెళ్లి కావడంలేదని మనస్తాపం చెంది మంచిర్యాల ఏసీసీ వెనుకాల గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు.
- 2021 జనవరిలో మంచిర్యాల శివారులో ఒక వృద్ధుడు, యువకుడు రైలు కిందపడి మృతి చెందారు. వృద్ధుడు స్థానిక రాజీవ్‌నగర్‌కు చెందిన దాసరి బాపుగా గుర్తించిన కుటుంబ సభ్యులు మృతదేహాన్ని తీసుకెళ్లారు. యువకుడు ఎవరనేది ఇప్పటికీ ప్రశ్నార్థకంగానే మిగిలిపోయింది.

ఆత్మహత్యే శరణ్యంగా భావిస్తున్నారు



చాల మంది క్షణికావేశానికి గురై ఆత్మహత్యలే శరణ్యంగా భావించి బంగారు భవిష్యత్‌ను కోల్పోతున్నారు. ఇందులో ఎక్కువ శాతం 20 నుంచి 40 సంవత్సరాల వారే అధికంగా ఉంటున్నారు. ఎక్కడో ఉంటున్నారు. రైలు రాగానే ఎదురుగా వెళ్లి ఆత్మహత్య చేసుకుంటున్నారు. మద్యం సేవించి మత్తులో రైలు పట్టాలపై పడుకుంటున్నారు. దీంతో శరీరాలు గుర్తు పట్టలేని విధంగా నుజ్జునుజ్జవుతున్నాయి. వాటిని తొలగించాలన్నా తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తోంది. కానీ ఉద్యోగరీత్యా తప్పదు. గుర్తు తెలియని మృతదేహాలకు సంబంధించి పత్రిక ప్రకటన ఇస్తున్నాం. మూడు రోజుల పాటు చూసి అంత్యక్రియలు నిర్వహిస్తున్నాం.

– సుధాకర్, జీఆర్‌పీ ఎస్సై, మంచిర్యాల

గడ్డివాము దగ్ధం


కాలుతున్న గడ్డివాము

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని బో యవాడ సమీపంలో నారాయణకు చెందిన గడ్డివాము ప్రమాదవశాత్తు దగ్ధమైంది. గడ్డి వాము విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని, ప్రభుత్వం నష్టపరిహారం అందించిఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

తిమ్మాపూర్‌లో శిక్షణ ప్రతినిధుల పర్యటన


వివిధ శాఖల సిబ్బందితో శిక్షణ ప్రతినిధులు

జన్నారం: స్టాఫ్ సెలక్షన్ ద్వారా నియామకమైన వివిధ రాష్ట్రాలకు చెందిన ఐదుగురు అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లు సోమవారం శిక్షణలో భాగంగా జన్నారం మండలం తిమ్మాపూర్‌లో పర్యటించారు. మాజీ సర్పంచ్ జాడి గంగాధర్ వారికి స్వాగతం పలికారు. ఎంపీవో రమేశ్, ఈజీఎస్, వెటర్నరీ, రేవెన్యూ, వ్యవసాయ శాఖలకు చెందిన సిబ్బంది వారికి సౌకర్యాలు కల్పించారు. శిక్షణలో భాగంగా ఈనెల 25 వరకు అదే గ్రామంలో ఉంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించిన మౌలిక వసతులను పరిశీలించడం, వ్యవసాయం గురించి రైతులతో మాట్లాడటం , మహిళా సంఘాలతో మాట్లాడటం జరుగుతుందని ప్రతినిధులు సురేందర్ స్వరూప్, బిగ్నరాజ్ మిస్రా, నిఖిల్ జూన్, విశాల్ దకాడ్, శివమ్ తెలిపారు.

మాలధారణకు వెళ్తూ మరలిరాని లోకాలకు..

- గోదావరిలో మునిగి విద్యార్థి మృతి


కీర్తన్‌గౌడ్ మృతదేహం

దండేపల్లి: హనుమాన్ మాలధారణ కోసం వెళ్తూ గోదావరి నదిలో స్నానం చేస్తూ విద్యార్థి నీటమునిగి మృతి చెందిన సంఘటన మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం గూడెం గోదావరి నది వద్ద చోటు చేసుకుంది. ఎస్సై భూమేష్ తెలిపిన వివరాల ప్రకారం. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం బద్దిపల్లికి చెందిన ఇంటర్ విద్యార్థి దుర్గం కీర్తన్‌గౌడ్ అలియాస్ రిషి (19) హనుమాన్ మాలాధారణ కోసం స్నేహితులతో కలిసి సోమవారం దండేపల్లి మండలం గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయానికి బయల్దేరాడు. గూడెం గోదావరి వంతెన సమీపంలో స్నానం చేసేందుకు నదిలో దిగారు. కీర్తన్‌కు ఈత రాకపోవడంతో స్నేహితుల కళ్లముందే నీటిలో మునిగి చనిపోయాడు. పోలీసులకు సమాచారం అందించడంతో గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం లక్సెట్టిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని తండ్రి తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కాపలా ఉండి ప్రాణాలు కాపాడారు..

- తెగిపడిన విద్యుత్ తీగలు
- నకాలంలో స్పందించని సబ్‌స్టేషన్ ఆపరేటర్


తెగిపడిన విద్యుత్ వైర్ల వద్ద కాపలా ఉన్న గ్రామస్తులు

వేమనపల్లి: తెల్లవారుతోంది.. చిమ్మచీకటి తొలగనే లేదు.. మండల కేంద్రంలో తునికాకు సేకరణ కోసం వెళ్లే ప్రజలు పరుగులు తీస్తున్నారు.. రైతులు వరి కల్లాల వైపు.. పశువులు మేత కోసం పొలాల వైపు వెళ్తున్నాయి. అంతలోనే ప్రధాన రహదారిపై విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. మంటలు లేస్తుండటంతో రోడ్డుపై వెళ్తున్న ఏమ కిష్టయ్య, కంపెల సత్యం, మధునయ్య గమనించారు. గతంలో ఇదే ప్రదేశంలో విద్యుత్ తీగలు తెగిపడి గొండే రాజన్న, గేదె అక్కడికక్కడే మృతి చెందారు. అదే ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకొని రోడ్డుపై నిలబడి ప్రజలను అప్రమత్తం చేశారు. పశువులను దారిమళ్లించారు. విద్యుత్ సరఫరా నిలిపివేయాలని నీల్వాయి సబ్‌స్టేషన్ ఆపరేటర్‌కు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయకపోవడంతో జేఎల్ఎం ఉదయ్‌కుమార్, ట్రాన్స్‌కో ఏఈ దీక్షిత్‌లకు ఫోన్ చేసి ప్రమాద పరిస్థితిని వివరించారు. వారి జోక్యంతో సరఫరా నిలిపివేయగా పెను ప్రమాదం తప్పింది.

కార్మికుల హక్కుల పరిరక్షణకు కృషి


పత్రాలు అందజేస్తున్న నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): ఏఐటీయూసీకి కార్మికులు ఎంతో నమ్మకంతో గుర్తింపు హోదా కల్పించారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిత్యం అందుబాటులో ఉంటూ హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తామని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి అన్నారు. సోమవారం బెల్లంపల్లి ఏరియాలోని కై రిగూడ ఓసీపీలో ఏఐటీయూసీ నూతన పిట్ కమిటీని యాజమాన్యానికి పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొగ్గు ఉత్పత్తికి ఇచ్చే ప్రాధాన్యత కార్మిక శ్రేయస్సుకు కూడ ఇవ్వాలని అన్నారు. యాజమాన్యం నిర్దేశించిన లక్ష్య సాధనకు ఏఐటీయూసీ పూర్తిస్థాయిలో సహకరిస్తుందని, అదే తరహాలో కార్మిక సంక్షేమానికి యాజమాన్యం కట్టుబడి పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శులు జగ్గయ్య, శేషు, రాజేశ్, కిరణ్‌బాబు, చంద్రశేఖర్, దివాకర్, తదితరులు పాల్గొన్నారు.

'కిరీటి కుటుంబాన్ని పరామర్శించాలి'


మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

జైపూర్: అధికారుల వేధింపులకు బలైన యువ ఇంజినీర్ కిరీటి కుటుంబాన్ని సీఎండీ పరామర్శించాలని హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ డిమాండ్ చేశారు. సోమవారం పవర్ ప్లాంటు వద్ద విలేకరులతో మాట్లాడారు. ఎస్టీపీపీలో అధికారి మరణిస్తే సీఎంవోఏ సంఘం ఇప్పటి వరకు స్పందించకపోవడం బాధాకరమన్నారు. తక్షణమే అవుట్ సోర్సింగ్ అధికారులను తొలగించి కంపెనీ అధికారులనే ఈడీగా నియమించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై ఇప్పటికే పలుమార్లు సమ్మె నోటీసులు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గాడిపెల్లి కృష్ణప్రసాద్, ఎస్టీపీపీ జనరల్ సెక్రెటరీ విక్రమ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సాయికృష్ణరెడ్డి, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి దారుణ హత్య



చంద్రశేఖర్ (ఫైల్)

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలం గన్నారం గ్రామానికి చెందిన గుర్లె చంద్రశేఖర్ (28) సోమవారం రాత్రి దారుణ హత్యకు గురయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గ్రామంలో మద్యం మత్తులో నలుగురు యువకుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో చంద్రశేఖర్‌ను మిగతా యువకులు బండ రాయితో మోదడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకార్ పరిశీలించి హత్యకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం


బెల్లంపల్లి: బెల్లంపల్లి–మందమర్రి రైల్వే స్టేషన్‌ల మధ్య రైలు పట్టాలపై సోమవారం మధ్యాహ్నం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ కె.సురేష్‌గౌడ్ తెలిపారు. మృతునికి 45 నుంచి 50 ఏళ్లు ఉంటాయని, ఏదో గుర్తు తెలియని రైలులో నుంచి కిందపడిపోయి మృతిచెంది ఉంటాడన్నారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, నల్లని సన్నగీతలు కలిగిన తెల్లరంగు ఫుల్ షర్ట్, నల్లరంగు కాటన్ జీన్ ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని బెల్లంపల్లిలోని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ గదిలో భద్రపరిచామన్నారు. మృతుని వివరాలు తెలిసిన వారు 8712658596 నంబర్‌లో సంప్రదించాలన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యాపారి మృతి


శ్రీనివాస్(ఫైల్)

భీమారం: ఈ నెల 18న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన మండల కేంద్రంలోని బీసీకాలనీకి చెందిన వ్యాపారి కొమ్ము శ్రీనివాస్ (48) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో కొన్నేళ్ల నుంచి కిరాణ షాపు నిర్వహిస్తున్న శ్రీనివాస్ వ్యాపారంలో నష్టాలు రావడంతో మనస్తాపం చెందాడు. ఈనెల 18న ఇంటినుంచి బయటకు వెళ్లి పురుగుల మందు తాగడంతో కుటుంబ సభ్యులు మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతునికి భార్య విజయలక్ష్మి, కుమారుడు అభిరామ్ ఉన్నారు.

తునికాకు కూలీకి గాయాలు



చికిత్స పొందుతున్న మదునక్క

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలం చారిగాం గ్రామానికి చెందిన మదునక్క సోమవారం కాగజ్‌నగర్ అటవీ ప్రాంతంలో తునికాకు సేకరణకు వెళ్లింది. చెట్టెక్కి తునికాకు తెంపుతుండగా ప్రమాదవశాత్తు జారి కింద పడడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

వైద్య ఖర్చులు ఇవ్వాలి

గాయపడిన కూలీకి అటవీశాఖ అధికారులు వైద్య ఖర్చులు చెల్లించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కోట శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బాధితురాలిని ఆయన పరామర్శించారు.

నీలగిరి తోటలో మంటలు


రామకృష్ణాపూర్ పట్టణం సూపర్‌బజార్ ఏరియాలోని గురుకుల పాఠశాల ఆవరణలో గల నీలగిరి తోటలో సోమవారం మధ్యాహ్నం అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. మంటలు పెద్దఎత్తున వ్యాపించడంతో గుర్తించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే చేరుకున్న సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. – రామకృష్ణాపూర్

'ఎస్డీఎల్ యంత్రాలకు నాసిరకం ఆయిల్'


కార్మికులతో మాట్లాడుతున్న బాజీసైదా

శ్రీరాంపూర్: ఎస్‌డీఎల్ యంత్రాలకు నాసిరకం ఆయిల్ సరఫరా అవుతోందని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్కే బాజీ సైదా ఆరోపించారు. సోమవారం ఆర్కే న్యూటెక్ గనిని సందర్శించి కార్మికుల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం గని మేనేజర్‌ని కలిసి సమస్యలు విన్నవించారు. ఎస్‌డీఎల్ యంత్రాలలో నాసిరకం ఆయిల్ వాడడం వలన యంత్రాలు చెడిపోవడం కాకుండా వాటితో పని చేసేటప్పుడు ఆపరేటర్లు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్పేర్ పార్ట్స్ కూడా సరిగా ఉండడం లేదన్నారు. కాలం చెల్లిన యంత్రాలను వినియోగం నుంచి తీసివేయాలన్నారు. అంతేకాకుండా డ్రిల్ రాడ్స్, డ్రిల్ బిట్స్ కొరత తీవ్రంగా ఉందని వీటిని డిమాండ్‌కు సరిపడా తెప్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోతుక్కూరి కొమురయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి సంపత్, పిట్ సెక్రటరీ ఆకుల లక్ష్మణ్, నాయకులు రమేశ్, సంపత్, రాజమౌళి, రాజయ్య, తిరుపతిరెడ్డి, రాజకుమార్, తదితరులు పాల్గొన్నారు.

చెరువులో వాటా ఇవ్వాలని ఆందోళన


చెరువు వద్ద ఆందోళన చేస్తున్న ముదిరాజ్ కులస్తులు

చెన్నూర్: చెన్నూర్ పెద్ద చెరువులో వాట ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం ముదిరాజ్ కులస్తులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 60 ఏళ్లుగా పెద్ద చెరువులో గంగపుత్రులు, ముదిరాజ్ కులస్తులకు సమాన వాటా ఉన్నట్లు 1998లో పెద్ద మనుషుల మధ్య ఒప్పందం కుదరిందన్నారు. లిఖిత పూర్వకంగా ఇరు కులాలకు చెందిన పెద్ద మనుషులు కాగితాలు రాసుకున్నారన్నారు. కొంత కాలం క్రితం కొందరు గంగపుత్రులు ముదిరాజ్ కులస్తులకు తెలియకుండా బోగస్ సభ్యుల పేర్లతో అధికారులకు లంచాలు ఇచ్చి అక్రమంగా సొసైటీ చేసుకున్నారని ఆరోపించారు. సొసైటీ పేరుతో ఇతర జిల్లాల నుంచి చేపలు పట్టే వారిని తీసుకొని వచ్చి చేపలు పట్టి అమ్ముకుంటున్నారన్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సొసైటీలో ఉన్న సభ్యులు వివరాలు సేకరించి బోగస్ సభ్యుల పేర్లను తొలగించాలన్నారు. విషయం తెలుసుకున్న ఎస్సై వెంకటేశ్వర్‌రావు సంఘటన స్థలానికి చేరుకుని అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో గిరెల్లి మల్లయ్య, సాధనబోయిన కృష్ణ, తుమ్మ రమేశ్, జోడు శంకర్, పిట్టల రవి, నెన్నల భీమయ్య, తుమ్మ రాములు, తదితరులు పాల్గొన్నారు.

ఓవర్‌బ్రిడ్జిపై విద్యుత్ సౌకర్యం కల్పించాలి


కారుచీకట్లలో రైల్వే ఓవర్ బ్రిడ్జి

మందమర్రిరూరల్: పట్టణంలోని రామన్ కాలనీ వద్ద నూతనంగా రైల్వే ట్రాక్‌పై ఏర్పాటు చేసిన ఓవర్ బ్రిడ్జిపై విద్యుత్ సౌకర్యం కల్పించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. రాత్రి సమయాల్లో వెళ్తురు లేకపోవడంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులతో పాటు పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. అంతే కాకుండా సరదాగా సమీపంలోని పార్కుకు వెళ్లి ఇంటికి నడుచుకుంటూ వెళ్లే వారికి ప్రమాదం జరిగే అవకాశం ఉందని ప్రజలు పేర్కొంటుందన్నారు. వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా, ప్రజలకు ప్రమాదాలు జరుగకుండా ఉండేందుకు వెంటనే ఓవర్ బ్రిడ్జిపై విద్యుత్ సౌకర్యం కల్పించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.